క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం


శ్రీనివాసులను సన్మానిస్తున్న వెంకటేశ్వర్లు

వెంకటగిరి రూరల్: పట్టణానికి చెందిన చేనేత కళాకారుడు లక్కా శ్రీనివాసులు సంతకబీర్ అవార్డుకు ఎంపిక కావడంపై ప్రముఖ ఉపాధ్యాయులు అప్పిన వెంకటేశ్వర్లు శనివారం శాలువతో అభినందించారు. చేనేత కళల్లో తనకంటూ ప్రత్యేకతను చాటుకుని సంతకబీర్ అవార్డుకు శ్రీనివాసులు ఎంపిక కావడం వెంకటగిరికే గర్వ కారణంగా ఉందన్నారు.

ప్లాస్టిక్ నివారణపై ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కలువాయి(సైదాపురం): కలువాయిలోని బీవీఎన్ఆర్ జెడ్పీ హైస్కూల్ ఎన్‌సీసీ అసోసియేట్ ఆఫీసర్ పెంచల పుల్లయ్య ఆధ్వర్యంలో పేపర్ బ్యాగ్‌డే నిర్వహించారు. అందులో భాగంగా ఎన్‌సీసీ విద్యార్థులు హైస్కూల్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ నివారణే ముఖ్య ఉద్దేశంగా పేపర్ బ్యాగులు, జూట్‌బ్యాగులు వినియోగించడానికే వాడే విధంగా ప్రోత్సహించాలని నినదించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

సూళ్లూరుపేట రూరల్ : మండలంలోని మంగళంపాడు జెడ్పీ పాఠశాలలో ఎస్పీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సుమారు 80 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. ఇందులో 29 మందికి కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.2 లక్షల విరాళం


విరాళం అందిస్తున్న దాతలు

రాపూరు: మండలంలో శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి నిత్య అన్నదాన పథకానికి శనివారం నెల్లూరుకు చెందిన మాడల జానకిరామ్ సతీమణి సూర్యవతి రూ.2,00,232 విరాళంగా అందించినట్లు ఏసీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. దాతలకు మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు తీర్థప్రసాదాలు అందించారు.

వూలా రవికుమార్ నియామకం

గూడూరు రూరల్ : బిషప్ రెవరెండ్ డాక్టర్ వూలా రవికుమార్‌ను తెలుగు రాష్ట్రాల కో–ఆర్డినేటర్‌గా ఎంపిక చేసినట్లు పాస్టర్స్ పవర్ వ్యవస్థాపక, జాతీయ అధ్యక్షుడు పులగర శోభనబాబు తెలిపారు. ఈ మేరకు శనివారం గూడూరులోని చర్చివీధిలో ఉన్న వూలా రవికుమార్ నివాసంలో పాస్టర్స్ పవర్ గుర్తింపు కార్డును అందజేశారు.

మోసానికి మారుపేరు చంద్రబాబు

- ప్రజలను దగా చేయడంలో ఆయన దిట్ట
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్ కిలివేటి సంజీవయ్య
- బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కరపత్రాల ఆవిష్కరణ


పార్టీ అధినేత వైఎస్ జగన్ ప్రసంగాన్ని వర్చువల్‌గా తిలకిస్తున్న పార్టీ నాయకులు


బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట : చంద్రబాబు అంటే మోసం, వంచన, దగా అని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' పేరుతో ఇంటింటికీ వంచన అనే కార్యక్రమాన్ని శనివారం స్థానిక సత్యసాయి కళ్యాణమండపంలో నిర్వహించారు. ముందుగా చంద్రబాబునాయుడు సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలను ఏ విధంగా వంచించారో జగనన్న వీడియో క్లిప్పింగ్స్‌తో అందరికీ చూపించారు. సూపర్‌సిక్స్ పథకాలకు సంబంధించి ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు క్యూ ఆర్ కోడ్ కలిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కరపత్రాలను ఆవిష్కరించారు.

పింఛన్లలోనూ కోతలే

2014 ఎన్నికల్లో గెలిచేందుకు సుమారు 106 నెరవేర్చలేని హామీలిచ్చి ప్రజల్ని మోసంచేశారని కిలివేటి సంజీవయ్య గుర్తుచేశారు. అదే విధంగా 2024లో మళ్లీ నెరవేర్చలేని హామీలతో అధికారాన్ని చేపట్టిన చంద్రబాబు ఆరు, ఏడు లక్షల కోట్లతో పథకాలిస్తానని చెప్పి గడిచిన ఏడాదిలో కేవలం ఏడు వేల కోట్లు మాత్రమే ఇవ్వగలిగారని అన్నారు. అవి కూడా పింఛన్లు మాత్రమే ఇచ్చి అమలు చేసేశాం అంటూ డప్పుకొంటుకున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 66.52 లక్షలమందికి పింఛన్లు ఇస్తే వాటిలో కోత విధించి కేవలం 65 లక్షల మందికి మాత్రమే పింఛన్లు ఇస్తున్నారని అన్నారు. అంటే 1.52 లక్షల మందికి పింఛన్లు ఎగ్గొట్టారని గుర్తుచేశారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రూ. 20 వేలు ఇస్తానని చెప్పి నేటి వరకు పైసా కూడా ఇవ్వకుండా మోసం చేశారని చెప్పారు. నిరుద్యోగ యువతకు 20 లక్షల మందికి ఉద్యోగాలిస్తామని, లేదంటే నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.4 వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఎగ్గొట్టారని పేర్కొన్నారు.

తల్లికి వందనంలోనూ ఆంక్షలు

గతంలో అమ్మఒడికి ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇస్తే ఇప్పుడు సవాలక్ష ఆంక్షలు విధించడంతో చాలా మందికి తల్లికి వందనం రాలేదని కిలివేటి పేర్కొన్నారు. ''అయ్యా చంద్రబాబు గారూ మీరూ, మీ కుమారుడు లోకేష్ వెళ్లిన పాఠశాల.. మా జగనన్న నాడు–నేడు కింద తీర్చిదిద్దినదే. మీరు పిల్లలతో కూర్చున్న బల్లలు మేము ఇచ్చినవే అన్న విషయమైనా గ్రహించారా..?'' నంటూ ఎద్దేవా చేశారు. అమ్మ ఒడిని జగనన్న రూపొందించి ప్రవేశపెడితే, దీనికి పేరు మార్చి తల్లికి వందనం సృష్టికర్త లోకేష్ అని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. చంద్రబాబుకు వయసువచ్చింది కానీ అబద్ధాలు చెప్పడం మానలేదు. మోసం చేయడం మానలేదని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి, ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు అల్లూరు అనిల్ కుమార్‌రెడ్డి, వట్టూరు కిషోర్‌యాదవ్, కెళవి ఆర్ముగం, అల్లూరు రాహుల్ రెడ్డి, ఒబ్బు వెంకటరత్నం, పాదర్తి హరినాథ్‌రెడ్డి, పట్టణపార్టీ అధ్యక్షులు వేళ్లపాళెం కృపాకర్‌రెడ్డి, కలికి మాధవరెడ్డి, నాయుడుపేట మున్సిపల్ చైర్మన్ కటకం దీపిక, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు తడ రాజ్‌కుమార్, పార్టీ నాయకులు మద్దాలి సోమశేఖర్‌రెడ్డి, జెట్టి వేణుయాదవ్, చదలవాడ కుమార్, ఏకోల్లు మునస్వామి నాయుడు, మీజూరు రామకృష్ణారెడ్డి, బందిల మహేష్, సెంథిల్‌కుమార్, ఆర్‌కే సుందరం రెడ్డితోపాటు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మోసం

ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన రోజున మెగా డీఎస్సీ మీద మొదటి సంతకం చేశారని, ఏడాదైనా వారికి ఉద్యోగాలు రాలేదని సంజీవయ్య దుయ్యబట్టారు. ఆడబిడ్డ నిధికింద 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని, ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణమంటూ చంద్రబాబు చేసిన మోసాన్ని ఇంటింటికీ తెలియజేయాలని కార్యకర్తలను కోరారు. మండల, గ్రామ నాయకులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాన్ని తిప్పికొట్టేందుకు కార్యకర్తలు, నాయకులు పని చేయాలని కోరారు.

వేతనాలు వెంటనే పెంచాలి


నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు వెంటనే పెంచాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సీఐటీయూ తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లిచెంగయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆయన మా ట్లాడుతూ 13వ తేదీ నుంచి ఇంజనీరింగ్ కార్మికులు వారి కుటుంబ సభ్యులతో దీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఆ మరుసటి రోజు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలోకి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు టి సుబ్బయ్య, ఎస్ ప్రసాద్, సుబ్రమణ్యం, రమణయ్య, సుబ్బరత్నమ్మ, మహిళాసంఘం నాయకురాలు ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

రఫీ..చరిత్ర హీనుడిగా మిగిలిపోతావ్


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నాయుడుపేటటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో షేక్ రఫీకి పట్టణ అధ్యక్షుడి హోదా ఇచ్చి, మున్సిపల్ వైస్ చైర్మన్‌గా చేసిన మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యనే విమర్శిస్తే చరిత్ర హీనుడిగా మిగిలిపోతావ్ రఫీ.. అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. పట్టణంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ తన స్థాయిని మరిచి సంజీవయ్యపై విమర్శలు చేస్తున్నారని చెప్పారు. కోవిడ్ సమయంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు సంజీవయ్య అత్యవసరంగా మందులను తెప్పించి కాపాడిన విషయాన్ని మర్చిపోయావా రఫీ.. అంటూ ప్రశ్నించారు. పునర్జీవితం ప్రసాదించిన సంజీవయ్యను విమర్శించి, విశ్వాస ఘాతుకుడిగా మిగిలిపోయావని మండిపడ్డారు. సమావేశంలో కటకం జయరామయ్య, దారా రవి, పాలేటి నాగార్జున, షేక్ షబ్బీర్, కావేరిపాకం అశోక్ కుమార్, పేర్నాటి రాహుల్, కాలగంధ సునీల్ పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ శోభారాణి

కలువాయి(సైదాపురం): కలువాయిలో ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను డీడీ శోభారాణి శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులను వసతి, భోజనం, మరుగుదొడ్ల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల బాలుర హాస్టల్‌కు ప్రహరీ గోడ, గేట్ ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. పేద విద్యార్థులు ఎవరైనా ఉంటే హాస్టల్లో చేర్చుకుంటామని తెలిపారు. అయితే బాలుర హాస్టల్ వార్డెన్ డీడీ వచ్చిన సమయానికి లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు.

లక్ష్మీ నరసింహస్వామికి పల్లకీ సేవ


పల్లకీ సేవకు సిద్ధమైన స్వామి అమ్మవార్లు

చిల్లకూరు : మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకి సేవను నిర్వహించారు. ఆలయంలో ఉదయంతోనే స్వామి వారికి సుప్రభాత సేవను నిర్వహించారు. అనంతరం ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను పల్లకిలో ఊరేగించారు. ఆలయ ఈఓ రవికృష్ణ భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పల్లకీ సేవలో పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం


పెంచలకోనలో స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం అత్యంత వైభవంగా సాగింది. ఉదయం 4 గంటలకు అభిషేకం, 5 గంటలకు సుప్రభాతం, 6గంటలకు పూలంగిసేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో కొలువు దీర్చి వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛరణలతో కల్యాణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ నిర్వహించారు.

సత్యసాయి బాబా రథయాత్ర



వెంకటగిరి రూరల్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా రథయాత్ర పట్టణ పురవీధుల్లో సాగింది. సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని కాశీవిశ్వనాథస్వామి ఆలయం నుంచి రథయాత్ర ప్రారంభమైంది. తొలుత వెంకటగిరి రాజా కుటుంబీకులు డాక్టర్ వివి సాయికృష్ణయాచేంద్ర, సర్వజ్ఞకుమార యాచేంద్ర సాయిబాబా చిత్రపటానికి ప్రత్యేక పూజలు అందించి రథయాత్రను ప్రారంభించారు.

వెలిపై పోలీస్ స్టేషన్‌లో విచారణ


బాధితులను విచారిస్తున్న తహసీల్దార్, ఎస్‌ఐ

దొరవారిసత్రం : తనియాలి ఎస్సీ కాలనీకి చెందిన వృద్ధ దంపతులు ఉల్లాం గురవయ్య, చెంగమ్మ వెలిపై శనివారం సాయంత్రం దొరవారిసత్రం పోలీస్ స్టేషన్‌లో కాలనీ పెద్దలను పిలిపించి విచారణ చేపట్టారు. రెండు రోజుల కిందట సాక్షి దిన పత్రికలో ×వెలి నుంచి తప్పించండయ్యా॰ అనే వార్త ప్రచురితం కావడంతో తహసీల్దార్ శైలకుమారి, ఎస్‌ఐ అజయ్‌కుమార్ స్పందించారు. వెలి గల కారణాలపై విచారణ చేపట్టారు. వెలికి గురైన బాధితులతో పాటు కాలనీ పెద్దలను పోలీస్ స్టేషన్‌లో పిలిపించి మాట్లాడారు. కాలనీకి చెందిన వారు ఎవరైన బాధితులను ఇబ్బందులు పెట్టితే మాత్రం చట్టరీత్య చర్యలు తీసుకోవాల్సివస్తుందని హెచ్చరించారు. బాధితుడు గురవయ్య పక్కాగృహం నిర్మించే ప్రాంతాన్ని సర్వేయర్‌తో సర్వే చేసిన అనంతరం గృహం పనులు చేసుకోవచ్చని తహసీల్దార్ తెలియజేశారు. ఇంటి నిర్మాణం పనుల్లో కాలనీకి చెందిన వారు ఏవిధంగా ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకోక తప్పని తహసీల్దార్, ఎస్సై కాలనీ పెద్దలకు తెలియజేశారు. ఈ విచారణలో వీఆర్వో వరప్రసాద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్..

మద్యం మత్తులో మహిళ వీరంగం


మద్యం మత్తులో పోలీసులతో వాదిస్తున్న మహిళ

కలువాయి(సైదాపురం) : కలువాయి మండల ఎస్సీ కాలనీలో మహిళ మద్యం తాగి మత్తులో వీరంగం చేసింది. ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించే వారిపై రాళ్లతో దాడి చేసే ప్రయత్నం చేసింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులపై కూడా తిరుమలపాడు గ్రామానికి చెందిన ఆ మహిళ తిరగపడింది. ఎట్టకేలకు పోలీసులు ఆ మహిళను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. బెల్టుషాపుల పుణ్యమా అని ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు భయాందోళన వ్యక్తం చేశారు.


ప్రారంభమైన గంగమ్మ కొలుపు

రాపూరు: మండల కేంద్రంలో వెలసిన గంగమ్మ తల్లి కొలుపు శనివారం ఉదయం నుంచి వైభవంగా ప్రారంభమైంది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేషాలంకరణ చేపట్టారు. రాత్రి స్థానిక సిద్దలయ ఆలయం నుంచి గంగపెట్టెని మేళతాళాలతో ఊరేగిస్తూ యాదవులు వీరతాళ్లు వేసుకుంటూ గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు.


గంగమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

గంగ కాలువ పనులు కలేనా?


నెల్లూరుపల్లి గ్రామ సమీపంలో 14ఆర్ మేజర్ కాలువ దుస్థితి


నేలపట్టు గ్రామ సమీపంలో 14ఆర్ మేజర్ కాలువలో ఏపుగా పెరిగిన తుంగ

- కాలువ పూర్తి చేస్తే వేల ఎకరాల మెట్ట భూములకు సాగు నీళ్లు
- అటవీ అనుమతిలేక ఆగిన నిర్మాణం
- పట్టించుకోని అధికారులు

దొరవారిసత్రం: తెలుగు గంగ కాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టి పదేళ్లయినా పనులు పూర్తికాకపోవడంతో గంగ నీళ్లు ఈ ప్రాంతాల్లోని రైతులకు కలగానే మిగిలిపోయింది. దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాల్లో 22 కిలోమీటర్ల మేర పొడవున ఉన్న 14 ఆర్ మేజర్ కాలువ నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది. ఈ పనులు పూర్తి చేసే దిశగా స్థానిక నియోజకవర్గ ప్రజాప్రతినిధులు కానీ అధికారులు కానీ చర్యలు తీసుకోవడం లేదు. కాలువ నిర్మాణం పనుల విషయంలో అటవీ శాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో పలుచోట్ల పనులు ఆగిపోయాయి.

14ఆర్ మేజర్ కాలువ పూర్తి చేస్తే..

దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాల్లోని 14ఆర్ మేజర్ కాలువ పూర్తి చేస్తే 30 చెరువుల్లోకి గంగ జలాలు సులువుగా చేరుతాయి. మెట్ట ప్రాంతాల్లోని సుమారు 7వేల ఎకరాలు సాగులోకి వస్తాయి. 14ఆర్ మేజర్ కాలువ నెలబల్లి గ్రామ సమీపంలో తెలుగు గంగ 7వ బ్రాంచ్ కాలువ నుంచి మొదలై నెలబల్లి గ్రామం పరిధిలోని పంట పొలాలు మీదుగా నెల్లూరుపల్లి, మైలాంగం, నేలపట్టు, ఆనేపూడి, కల్లూరుకండ్రిగ, శ్రీధనమల్లి, తొగరాముడి గ్రామాల కలుపుకుంటూ సూళ్లూరుపేట మండల ఆబాకు గ్రామంలోని చెరువు వరకు విస్తరించి ఉంది. అన్ని ప్రాంతాల్లో కాలువ పనులు పూర్తి చేసి ఏళ్లు గడిచిపోతున్నాయి. కేవలం నెలబల్లి–నెల్లూరుపల్లి గ్రామాల పంట పొలాలు మధ్య, సూళ్లూరుపేట–దొరవారిసత్రం మండల సరిహద్దు ప్రాంతంలోని అడవి ప్రాంతంలో పలు అడ్డంకుల కారణంగా ఆగిపోయాయి. దీంతో ఈ కాలువ పలు ప్రాంతాల్లో పూడిపోయి పిచ్చిమొక్కలతో నిండిపోయి అధ్వాన్న స్థితికి చేరుకుంది.

గత ప్రభుత్వంలో అనుమతులు

14ఆర్ తెలుగు గంగ మేజర్ కాలువ పూర్తి చేసే దిశగా గతంలో ఉన్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కృషి చేశారు. అటవీ ప్రాంతంలో కాలువ తీసేందుకు అటవీ అధికారుల నుంచి అనుమతులు పొందడంతో పాటు కాలువ పనులు పనులు పూర్తి చేసేందుకు గత ప్రభుత్వం రూ.60 లక్షలు నిధులు సైతం మంజూరు చేసింది. కానీ ప్రభుత్వం మారడంతో గంగ పనులు ఎవరూ పట్టించుకోకుండా వదిలేశారు.

మంత్రికి బీజేపీ నాయకుల వినతి

నాయుడుపేటటౌన్: జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన పలువురు రైతులకు చెల్లించాల్సిన నష్ట పరిహారం చెల్లించకుండా అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానిక బీజేపీ నాయకులు మంత్రి సత్య కుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. విజయవాడలో క్యాంపు కార్యాలయం వద్ద శనివారం మంత్రిని స్థానిక బీజేపీ నాయకులు బొల్లకాయల విజయభాస్కర్, ఆశా చెంచకృష్ణయ్య, కొప్పులు సుబ్రహ్మణ్యం తదితర నాయకులు కలిసి విజ్ఞప్తి చేశారు.

కండలేరులో 30.538 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 30.538టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2050, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 25, మొదటి బ్రాంచ్ కాలువకు 65 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.